క్లుప్తంగా

టీడీపీ నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక



కారెంపూడి : మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన టీడీపీ అభిమానులు పలువురు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. చింతపల్లి గ్రామానికి చెందిన క్రోసూరు సైదమ్మ, శ్రీనివాసరావు, ఖమ్మంపాటి నారాయణమ్మ, నాగరాజు, పద్మ, అమరయ్య, అనూష వీరితో పాటు మరో ఐదు కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో నర్సరావుపేట పార్లమెంటు జిల్లా పార్టీ కార్యదర్శి పంగులూరి రామకృష్ణయ్య, గ్రామ సర్పంచ్ ఉన్నం శ్రీనివాసరావు, అలుగునూరి అమరయ్య, సూరె చెంచారావు, లంకా నాగేశ్వరరావు, మండల, కారెంపూడి పట్టణ పార్టీ అధ్యక్షులు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య పాల్గొన్నారు.

రేపు కాపు కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

కారెంపూడి: కారెంపూడిలో కాపు కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ, కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి చేతుల మీదగా శుక్రవారం నిర్వహించనున్నట్లు కాపు సంఘం నాయకులు తెలిపారు. వారు బుధవారం మాచర్ల తరలివెళ్లి ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డిలను ఘనంగా సన్మానించి భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలకు ఆహ్వానించారు. అలాగే దాచేపల్లి రహదారిలో కల్యాణ మండపం నిర్మాణానికి 40 సెంట్ల స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు తీసుకున్నారని కాపు సంఘ నాయకులు ప్రభుత్వ విప్ పీఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. పలిశెట్టి కోటేశ్వరరావు (మునసబు), కిల్లా చెన్నయ్య, బొమ్మిన అల్లయ్య, బొమ్మిన హనుమయ్య, కిల్లా కాశి, పలిశెట్టి హనుమంతరావు, మిరియాల పాపారావు, తోట రంగ, పలిశెట్టి వెంకటేశ్వర్లు, పుట్టా లచ్చయ్య, శెట్టి లక్ష్మయ్య, కిల్లా పేరయ్య,తోట అప్పయ్య,చింతపల్లి రామ్మూర్తి, పెనుగొండ్ల గోవిందు, నూనె వాసు, కోనేటి కోటేశ్వరరావు,పెనుగొండ్ల వెంకటేష్ తదితరులు 50 మంది ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌లను ఆహ్వానించడానికి వెళ్లినవారిలో ఉన్నారు.

15వ వార్డులో పింఛన్ పంపిణీ



పిడుగురాళ్ల: పట్టణంలోని 17 సచివాలయపరిధిలోని 33 వార్డు పరిధిలో ఉదయానే 6 గంటలకు వలంటీర్లు పింఛన్ పంపిణీ చేశారు. అంతేకాకుండా కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు వలంటీర్లు పనితీరు పరిశీలించి పింఛన్ దారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పింఛన్ దారులు ఉదయానే కోడి కూయకముందే వలంటీర్ వచ్చి తనను నిద్రలేపి మరీ పింఛన్ అందజేస్తున్నారని కౌన్సిలర్లుకు తెలియజేయడంతో ఆనందం వ్యక్తం చేశారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

పిడుగురాళ్ల: ట్రైన్ కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణ సమీపంలోని కళ్లం టౌన్ షిప్ వద్ద బుధవారం జరిగింది. వివరాల మేరకు... మండలంలోని కరాలపాడు గ్రామానికి చెందిన చల్లా మనోహర్‌రెడ్డి(24) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మనోహర్ బీటెక్ పూర్తిచేసి ఆస్ట్రేలియా వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ కళ్లం టౌన్ షిప్‌లోని రైల్వే ట్రాక్‌పై ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అందించారు.

రైతులకు అవగాహన సదస్సు

పిడుగురాళ్లరూరల్: ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉద్యాన పరిశోధన సంస్థలో పరిశోధించిన విత్తనాలను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని జాతీయ ఉద్యాన పరిశోధన శాస్త్రవేత్త బేజీబెన్ని అన్నారు. మండలంలోని గుత్తికొండ గ్రామంలో మిరప పంటపై రైతులకు అవగాహన సదస్సును బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బెంగుళూరు జాతీయ ఉద్యానవన శాస్త్రవేత్తలు బేజీబెన్ని, హత్యాసింగ్, డాక్టర్ నరేష్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ఉద్యాన వన పరిశోధన సంస్థ పరిశోధించిన మిరప విత్తనాలు అర్కమేఘన వంటి విత్తనాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు ఈ మండలంలో ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. గత ఖరీఫ్‌సీజన్‌లో ఈ విత్తన దిగుబడులు ఎలా ఉన్నాయి, ఏ ప్రాంతం అనుకూలం వంటి వాటిని వివరించారు. చిన్న, సన్న కారు రైతులకు కూడా ఈ విత్తనాలు అందించడం జరుగుతుందన్నారు. పిడుగురాళ్ల ఉద్యాన వనశాఖ అధికారి శ్రీనివాస్, గురజాల ఉద్యానవన శాఖ అధికారి వై. మోహన్, మాచర్ల ఉద్యాన వన శాఖ అధికారి ఎస్. సురేష్, చిలకలూరి పేట ఉద్యాన వన శాఖ అధికారి కె. కిషోర్, పెదకూరపాడు ఉద్యాన వన శాఖ అధికారి శ్రీ నిత్య, సత్తెనపల్లి ఉద్యాన వన శాఖ అధికారి జనని, విలేజ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

దుర్గి: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి పరమావధిగా పరిపాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల హృదయాల్లో నిలిచారని పల్నాడు జిల్లా అభివృద్ధి మండల చైర్మన్ ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అడిగొప్పల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన రాక సందర్భంగా గ్రామంలో భారీ ఎత్తున ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు శాలువతో సత్కరించి పూలదండలతో వారి అభిమానాన్ని చాటుకున్నారు. మహిళలు గుమ్మడికాయతో దిష్టి తీసి స్వాగతం పలికారు. స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజ నిర్వహించి అనంతరం ప్రతి గడపకు వెళ్లి గత మూడున్నర సంవత్సరాల కాలంలో వారికి అందిన లబ్ధి వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో మేజర్ గ్రామ పంచాయతీ అడిగొప్పలకి అన్ని విధాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల ముంగిటికి పౌర సేవలను అందించడం జరిగిందన్నారు. గ్రామ పరిధిలోని రెండు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని విధాలుగా ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. రాబోవు రోజుల్లో సీఎం జగన్‌కి ప్రజలందరూ మద్దతు తెలిపి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే విధంగా అండగా నిలవాలన్నారు. స్థానిక ప్రజలు ఆయన దృష్టికి సమస్యలు వివరించగా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాలి రామయ్య, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, నల్లబోతు వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోఅల్, ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్, వైస్ ఎంపీపీ ఊరిబండి యోగయ్య, మండల పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయ్, మాజీ జెడ్పీటీసి కొనకంచి బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కటకం చిన వెంకటయ్య, జంగా యలమంద, నాలి శ్రీను, తోట వాసు, రాయపాటి నాగేశ్వరరావు, మక్కెన వెంకటేశ్వర్లు, మాచర్ల జార్జి, తాళ్ళ అంబారావు, శెట్టిపల్లి కోటేశ్వరరావు, మాదాసు వాసు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి



ట్రోఫీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ప్రభుత్వ విఫ్ జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల: యువత క్రీడలపై మక్కువ చూపిస్తే భవిష్యత్ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఆటల్లో రాణిస్తే భవిష్యత్ బంగారు బాట అవుతుందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విఫ్ జంగా కృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీ సమీపంలో రాష్ట్రస్థాయి టెనిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఎమ్మెల్సీ, ప్రభుత్వ విఫ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఆటల పోటీలు మన ప్రాంతంలో నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని, ఆటల్లో గెలుపొందిన వారు ఉత్సాహంగాను, గెలుపొందని వారు నిరుత్సాహంతోను ఉండకూడదని, గెలుపు ఓటములను స్వాగతించి ప్రతి ఒక్కరు స్నేహభావంతో ఆటల్లో ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా తెలిపారు. నేటి యువత రేపటి భవితకు ఆదర్శమవ్వాలని సూచించారు. ఇటువంటి ఆటల పోటీలు పల్నాడు ప్రాంతంలో ఏర్పాటు చేసి ఆటలు నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం క్రికెట్ పోటీల్లో గెలుపొందబోయే విన్నర్లకు అందించే షీల్డ్‌లను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని దుశాలువాలతోసన్మానించారు. అదే విధంగా క్రికెట్ కోర్టులో జంగా కృష్ణమూర్తి హాజరై మొదటి బాలుకు బెటింగ్ చేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కోల్లోజు పాండు రంగాచారి, చెన్నారావు, షేక్ షరీఫ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనులతోపాటు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

ట్రస్ట్ ద్వారా కల్యాణ కానుక ప్రారంభం

దాచేపల్లి : కుల, మతాలకు అతీతంగా కల్యాణ కానుక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పల్నాడు హాస్పిటల్ అధినేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అన్నా రు. చింతలపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కల్యాణ కానుక కార్యక్రమాన్ని మండలంలోని తంగెడ గ్రామంలో బుధవారం ప్రారంభించారు. అన్నవరపు హుస్సేన్ కుమార్తె పావని వివాహం సందర్భంగా ట్రస్ట్ నుంచి బంగారు తాళిబొట్టు, పట్టుచీరె, సారెను డాక్టర్లు అశోక్ కుమార్, రమ్య హారిక అందజేశారు. ప్రతి ఆడబిడ్డ తమ తోబుట్టువులాంటి వారని, తమ ట్రస్ట్ ద్వారా కల్యాణ కానుక అందించడం సంతోషంగా ఉందని డాక్టర్ అశోక్‌కుమార్ చెప్పారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గురజాల : నగర పంచాయతీ పరిధిలోని 2వ బ్లాకులో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్‌లు షేక్ బడేజానీ, మన్నెం కన్యకుమారి ప్రసాద్‌లు సూచించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పాల్గొంటారన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మైనర్‌బాలిక వివాహానికి సన్నద్ధమవుతున్న తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

మాచర్ల : పట్టణంలోని నెహ్రూనగర్ ప్రాంతంలోని రెండో వార్డులోతొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినికి వివాహం చేసేందుకు తల్లిదండ్రులు సన్నద్ధమవుతున్నారన్న సమాచారంతో అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారులు బుధవారం అక్కడకు చేరుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్‌బాలిక కావడంతో వివాహం చేస్తూ ఇబ్బంది పెట్టడం మంచిది కాదని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు మైనర్‌బాలికకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి : మండలంలోని కొత్తూరు గ్రామంలో శ్రీ దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. వేదపండితులు హోమగుండ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. అదే విధంగా శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్యస్వామి ధ్వజస్థంభ ప్రతిష్ట కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా ప్రత్యేక పూజలు...

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ జంగాను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు కొప్పుల సాంబయ్య, అంబటి శేష గిరిరావు, వైస్ ఎంపీపీ కందుల జాను, సొసైటి చైర్మన్ బత్తుల లింగారెడ్డి, సర్పంచ్‌లు బొడ్డు నరసింహరావు, జాన్ అహ్మద్, ఉపసర్పంచ్ బాణావత్ శ్రీనివాసనాయక్, మార్కెట్ యార్డు డైరెక్టర్ యర్రంశెట్టి సైదారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు



బల ప్రదర్శనలో పాల్గొన్న ఎడ్ల జత

మాచవరం: సంస్కృతి, సాంప్రదాయాలు ఎంతో ఉన్నతమైనవని వాటిని కాపాడుకునేందుకు తిరునాళ్లను జరుపుకోవడం చాలా సంతోషకరమని గ్రామ మాజీ కరణం తంగెడ రామకృష్ణారావు అన్నారు. మండలంలోని మోర్జంపాడు గ్రామంలో లక్ష్మీ నృసింహ స్వామి 67వ కల్యాణ మహోత్సవం సందర్భంగా రైతుసేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజముల బల ప్రదర్శన పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులను ఉత్సాహపరిచేందుకు, పశు పోషణను ప్రోత్సహించేందుకు ఎడ్ల పందేలను జరుపుకోవడం హర్షణీయమన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఎడ్లు పోటీలకు రావడం ఎంతో సంతోకరమన్నారు. కార్యక్రమంలో పశుపోషకులు, రైతు సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జత పళ్ల విభాగంలో........

మొదటి రోజు జత పళ్ల విభాగంలో పోటీలు జరిగాయి. కల్లూరి శ్రీకాంత్ (గనికపూడి, ప్రత్తిపాడు) ఎడ్ల జత 3406 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గౌతుకట్ల వెంకటకృష్ణ యాదవ్, (మార్టూరు) పిల్లిగడ్డం రిహాన్(పిన్నెల్లి) కంబైన్డ్ ఎడ్ల జత 3399 అడుగులు, పోషం గోవర్ధన్‌రెడ్డి (మేళ్లచెరువు) ఎడ్ల జత 3238.9 అడుగులు, ఉప్పుల లక్ష్మయ్య చౌదరి(గోల్లముడిపాడు, పొన్నూరు) ఎడ్లు 3200 అడుగులు,నక్కా రాకేష్‌రెడ్డి (కొత్త ఓడరేవు, బాపట్ల)ఎడ్లు 2984.7 అడుగులు,గూడూరు సాయి తేజ చౌదరి(గణపవరం), గద్దె నాగేశ్వరావు(మోర్జంపాడు) కంబైన్డ్ ఎడ్ల జత 2800 అడుగులు,యామర్తి వెంకటేశ్వర్లు (శ్రీరుక్మిణీపురం, మాచవరం) ఎడ్ల జత 2624.7 అడుగులు, మర్రి బొల్లయ్య(గొల్లపాడు) ఎడ్లు 1627.3 అడుగుల దూరాన్ని లాగాయి. విజేతలకు వరుసగా రూ.20వేలు, రూ.15 వేలు, రూ.10వేలు, రూ.8 వేలు, రూ. 6వేలు, 5 వేలు, రూ.4వేలు, రూ.3వేలు బహుమతులు అందజేసారు.

కానుకమాత తిరుణాళ్లకు సర్వం సిద్ధం


- నేడు కానుకమాత దేవాలయం 173వ తిరుణాళ్ల
- ముస్తాబు అయిన దేవాలయం



తిరుణాళ్లకు ముస్తాబు అయిన కానుకమాత దేవాలయం

రెంటచింతల: మండే హృదాయాల్లో సైతం ప్రేమను వర్షించే ఆధ్యాత్మికకేంద్రంగా విరాజిల్లుతున్న కానుకమాత చర్చి 173వ తిరుణాళ్లకు సర్వం సిద్ధమైనట్లు విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి బుధవారం తెలిపారు. ఈ తిరుణాళ్ల వేడుకల్లో కుల మతాలకు అతీతంగా వేలాదిమంది భక్తులు పాల్గొని కానుకమాత కరుణాకటాక్షాలవీక్షణాలు పొందాలని కోరారు. రె.ఫాదర్ జోసఫ్ గ్రాండ్, కెనడిల ఆధ్వర్యంలో 1850సం.లో అద్భుతమైన ఆర్కిటెక్ పరిజ్ఞానంతో అత్యంత సుందరంగా నిర్మితమైన కానుకమాత దేవాలయం ప్రాంగణంలోని కళావేదికపై ఉదయం 9.30 గం.లకు తొలి తెలుగు కార్డినల్ పూల అంతోని నేతృత్వంలో పెద్దసంఖ్యలో ఫాదర్లతో పండుగ సమిష్టి మ హోత్సవ దివ్య పూజాబలి సమర్పించబడుతుందని తెలిపారు. జెయింట్ వీల్స్, బ్రేక్‌డాన్స్, పలు రకాల రంగుల రాట్నాలు, పెద్దసంఖ్యలో అంగళ్లు ఏర్పాటు చేయడంతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తు లు, బంధువులు తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకుందన్నారు. పండుగ దివ్యపూజాబలి అనంతరం కోలాట ప్రదర్శన, సాయంత్రం 3 గం.లకు మరియతల్లికి వత్తుల సమర్పణ ఉంటుందన్నా రు. రాత్రి 10 గం.లకు బాణ సంచాలు కాలుస్తూ దేవాలయం నుంచి కానుకమాత తేరు ప్రదక్షణ ప్రారంభం మౌతుందన్నారు. భక్తులు తేరు ప్రదక్షణలో క్రీస్తు గీతా లను ఆలపిస్తూ భక్తిశ్రద్ధలతో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో విచారణ సహాయ గురువులు రె.ఫాదర్ పి.స్లీవారెడ్డి, చర్చి పెద్దలు పాల్గొన్నారు.

నేడు కార్డినల్ పూల అంతోని రెంటచింతల రాక



తొలి తెలుగు కార్డినల్ పూల అంతోని

రెంటచింతల: స్థానిక కానుకమాత దేవాలయం 173వ వార్షికోత్సవంలో భాగంగా గురువారం నిర్వహిస్తున్న పండుగ సమిష్టి మహోత్సవ దివ్య పూజాబలిని సమర్పించేందుకు కతోలిక సంఘం కార్డినల్ పూల అంతోని వారు తరలివస్తున్నారు. కర్నూల్ జిల్లా గడివేముల మండలం చిందుకూరు గ్రామంలో పూల చిన అంతోని, ఆరోగ్యమ్మల 5వ సంతానంగా 1961 నవంబర్ 15న అంతోని జన్మించారు. 1961 నవంబర్ 20న పోరూరు విచారణలో తిరుకుటుంబ దేవాలయంలో జ్ఞానస్థానం పొందారు. 1980 సంవత్సరంలో కర్నూల్ సెమినార్‌లో గురువిద్యను, 1986–87 సం.లో బెంగుళూర్‌లోని పునీత పేతురు గురు విద్యాకేంద్రంలో తత్వశాస్త్రం పూర్తి చేసిన అంతోని అక్కడే 1988–92 సం.లో వేదశాస్త్రాన్ని ముగించారు. 1992 ఫిబ్రవరి 20న కడప మేత్రానం నందు గురువుగా మహాఘన సామినేని అరుళయ్యచే అభిషక్తుడయ్యారు. కడప పీఠంలో 16 సం.లు గురువుగా, 2008 సం. ఏప్రిల్ 19న కర్నూల్ పీఠానికి 4వ పీఠాధిపతిగా ఎన్నిక కాబడినారు. ప్రపంచం అంతా తిరుగుతూ క్రీస్తు సువార్తను బోధిస్తున్న అంతోని 2020 సం. నవంబర్ 19న హైదరాబాదు అగ్రపీఠానికి ఆర్చిబిషప్‌గా నియమితులైయ్యారు. అలుపెరుగని కృషి చేస్తున్న అంతోనిని గుర్తించిన పరిశుద్ధ పోప్‌గారైన ఫ్రాన్సిస్ 2022 మే 29న కార్డినల్‌గా ఎంపిక చేయడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి కార్డినల్‌గా ఎన్నక కాబడిన అంతోని పల్నాడు జిల్లా రెంటచింతలలో మొదటి సారిగా సమిష్టి దివ్యపూజా బలిని సమర్పించడానికి రానున్నట్లు విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి తెలిపారు.

ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

హౌసింగ్ ఈఈ శ్రీనివాస్

గురజాల : జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ శ్రీనివాస్ సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురం గ్రామంలో జగనన్న కాలనీ లే అవుట్‌ను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ జగనన్న కాలనీ లే అవుట్‌లో స్థలా లు తీసుకున్న ప్రతి లబ్ధిదారుడు విధిగా ఇంటి నిర్మాణాలు చేపట్టాలని వారికి సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించి వారిచే ఇంటి నిర్మాణాలు చేపట్టే విదంగా చర్యలు చేపట్టాలన్నా రు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాన్ని వంద శాతం నెర వేర్చు విధంగా విధులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఇ ఎ సురేష్, వర్కు ఇన్స్పెక్టర్, ఎస్ మరియదాసు తదితరులున్నారు.

చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టనున్న సుబ్బమ్మ



కోప్పల సుబ్బమ్మ



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ బిలాలుద్దీన్, కమిషనర్ శ్రీవిద్య

దాచేపల్లి : నాడు ఎంపీపీ.. నేడు నగర పంచాయతీ చైర్ పర్సన్..ఈ అరుదైన అవకాశం దాచేపల్లికి చెందిన కొప్పుల సుబ్బమ్మకు దక్కింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య భార్య సుబ్బమ్మ ఈ నెల 3వ తేదీన దాచేపల్లి నగర పంచాయతీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టానున్నారు. 1996లో దాచేపల్లి-3 ఎంపీటీసీ సభ్యురాలిగా ఎన్నికైన సుబ్బమ్మను ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాలుగేళ్ల పాటు ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన సుబ్బమ్మ మండలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల మన్నలను పొందారు. 2021లో జరిగిన నగర పంచాయతీ మొట్టమొదటి ఎన్నికల్లో 10వ వార్డు నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన సుబ్బమ్మను కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ప్రజలు ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సుబ్బమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు దోహదపడ్డాయి. మొదటి విడత చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన మునగా రమాదేవి అనారోగ్యంతో మృతిచెందడంతో చైర్‌పర్సన్ పదవి ఖాళీ అయ్యింది. నగర పంచాయతీలో వైఎస్సార్ సీపీ 11 మంది, టీడీపీ 07 మంది, జనసేన 01 మంది , స్వతంత్రులు 01 కౌన్సిల్ సభ్యులు ఉన్నారు. కౌన్సిలర్ రమాదేవి మృతితో వైఎస్సార్ సీపీ సభ్యులు 10 మంది ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఎక్స్ ఆఫీషియో సభ్యుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సూచనతో కొప్పుల సుబ్బమ్మను చైర్‌పర్సన్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించనున్నారు. ఈ ఎన్నిక ప్రశాంతంగా జరిగేలా వైఎస్సార్ సీపీ నాయకులు చర్యలు తీసుకున్నారు. చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి సుబ్బమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

చైర్‌పర్సన్ ఎన్నికకు ఏర్పాట్లు

దాచేపల్లి : నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నికకు ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య తెలిపారు. సీఐ షేక్ బిలాలుద్దీన్, కమిషనర్ శ్రీవిద్య బుధవారం ఎన్నికకు సంబంధించిన ఏర్పాట్లు పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 3వ తేదీన ఉదయం 11గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఎన్నిక జరుగుతుందని, కౌన్సిల్ సభ్యులు, ఎక్స్‌అఫీషియో సభ్యుడైన స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఈ ఎన్నికలో పాల్గొంటారని కమిషనర్ శ్రీవిద్య చెప్పారు. ప్రశాంతంగా చైర్‌పర్సన్ ఎన్నిక జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, అనుమతిలేని వ్యక్తులను కార్యాలయంలోకి అనుమతించమని ఆమె వివరించారు.

కళాశాల అభివృద్ధికి రూ. 50 వేల వితరణ



ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ లక్ష్మీకుమారికి నగదును అందజేస్తున్న కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు

మాచర్ల : ఎస్‌కెబిఆర్ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీ అభివృద్ధికి కమిటీ ఎంతో కృషి చేస్తోందని అధ్యక్షులు, పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌కెబిఆర్ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీలో జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహకారంతో కాలేజీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కమిటీ పనిచేస్తోందన్నారు. ఈ సందర్భంగా కమిటీ తరపున రూ. 50 వేలను డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ లక్ష్మీకుమారికి అందజేశారు. అనంతరం పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా ఎంపికైన సందర్భంగా కుర్రి సాయిమార్కొండారెడ్డిని జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్ బుల్లయ్య, లక్ష్మీకుమారిలు పూల మాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఉత్తమ అవార్డు అందుకున్న జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ బుల్లయ్యను శాలువాతో సత్కరించారు.

156 మందికి ఓటీఎస్ పట్టాలు పంపిణీ



లబ్ధిదారులకు ఉచితంగా ఓటీఎస్ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ బూడిద శ్రీను

విజయపురిసౌత్: మాచర్ల మండలం చింతలతండా గ్రామంలో బుధవారం మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీను 156 మంది గ్రామస్తులకు ఓటీఎస్ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీను మాట్లాడుతూ గత 20 ఏళ్ళ క్రితం ఎస్సీ, ఎస్టీలు స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్‌లో ఇంటి పట్టాలు పెట్టి రుణాలు పొందారన్నారు. రుణాలు కట్టలేక లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం ప్రభుత్వం దృష్టికి రావడంతో వెంటనే స్పందించి వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా ఉచితంగా పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. దీనిలో భాగంగా చింతలతండాలో లబ్ధిదారులకు పట్టాలు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాచర్ల జెడ్పీటీసీ మల్లుస్వామి, చింతలతండా సర్పంచ్ కేతావత్ శ్రీనునాయక్, ఎంపీటీసీ సీతానాయక్, మాచర్ల ఇన్‌చార్జి ఎంపీపీ కోటేశ్వరావు, ఉప సర్పంచ్ లచ్చునాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.